క్లుప్తంగా

కేశంపేట డీటీగా గీత



డీటీగా బాధ్యతలు స్వీకరించిన గీత

కేశంపేట: కేశంపేట నాయబ్ తహసీల్దార్‌గా గీత బాధ్యతలు స్వీకరించారు. షాద్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిమిత్తం కేశంపేటకు నాయబ్ తహసీల్దార్‌గా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ ఆనందరావు గతంలోనే వికారాబాద్ జిల్లాకు తహసీల్దార్‌గా వెళ్లారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న పోస్టుకు ఉన్నతాధికారులు ప్రమోషన్‌పై గీతను పంపించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నేటి నుంచి చిలుకూరు గురుకులంలో క్రీడలు



క్రీడా పోటీలకు సిద్ధమైన మైదానం

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు చిలుకూరు గురుకులంలో ప్రారంభం కానున్నాయి. 13 నుంచి 16 వరకు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 11 బాలుర గురుకులాల నుంచి 955 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం నుంచే క్రీడా పోటీలు మొదలు కానుండడంతో గురువారం మధ్యాహ్నం నుంచే విద్యార్థులంతా చిలుకూరు గురుకులానికి చేరుకున్నారు. గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద వెంకటేశ్ క్రీడా పోటీల నిర్వహణకు జరుగుతున్నా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయపాలన, సమయస్ఫూర్తితో పోటీలు నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కోరుతూ గురువారం విజయకుమార్ ఆర్డీఓ వెంకటమాధవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులు గడుస్తున్నా నేటి వరకు అధికార పార్టీ ఫ్లెక్సీలు, ప్రచార సాధనాలను తీయకపోవడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. కోడ్‌ను అమలు చేయడంలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం తప్పనిసరి



పుస్తకాలు అందిస్తున్న ఎఎస్‌రెడ్డి, కాంచనలత

చేవెళ్ల: నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం తప్పనిసరిగా సాధించాలని ప్రముఖ స్పోకెన్ ఇంగ్లిష్ నిర్వాహకుడు ఎఎస్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కాంచనలత ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో చదివే విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, రూప్నరవీంద్ర, వైష్ణవి, జ్యోతి, స్వర్ణలత, లక్ష్మీ, సతీష్, వెంకటేశ్వర్లు, రవీంద్ర, రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..!

సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక

- తీరొక్క పూల విశేషాల సమాహారం
- మనిషి జీవన స్థితిగతులకు అద్దం పట్టనున్న పాటలు
- నేటి నుంచే ప్రారంభం కానున్న ఉత్సవాలు



బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

షాద్‌నగర్: పట్టు చీరలతో మహిళా మణులు, పట్టు పరికిణీలతో తెలుగింటి ఆడపడుచులు ఎటు చూసినా రంగురంగుల పూలు, అడుగడుగునా సంప్రదాయం వట్టి పడే విధంగా ఉత్సవాలు జరుగనున్నాయి. ఆటా పాటలతో సందడి ప్రతీ ఏటా కనిపించే బంగారు బతుకమ్మ వరవడి తెలంగాణ సంప్రదాయానికి, జీవనస్థితి గతులకు అద్దం పడుతుంది. దసరా పండుగకు ముందు అలరించే ఈ బతుకమ్మ ప్రత్యేక రాష్ట్రంలో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంగిలి పువ్వుతో మొదలై సద్దుల బతుకమ్మతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ఈ ఉత్సవాలు నేటి నుంచే ప్రారంభం కానున్నాయి.

పూల గుమగుమలు..

బతుకమ్మ అంటేనే పూల పండుగని చెబుతారు. ఈ వేడుకలు వచ్చాయంటే చాలు అన్ని ప్రాంతాలు పూల గుమగుమలతో కళకళలాడుతాయి. తంగేడు, గునుగు, తామర, గుమ్మడి, బంతి, చామంతి లాంటి రకరకాల పూలను తీసుకొచ్చి సర్వాంగ సుందరంగా బతుకమ్మలను పేరుస్తారు. వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేస్తారు. ఆ పాటల్లోనే అమ్మవారిని భక్తిగా కొలుస్తారు.

బతుకమ్మకు పేర్లు..

బతుకమ్మకు సంబంధించి రకరకాల పేర్లు ఉన్నాయి. ఎంగిలిపూలని, అటుకుల, ముద్దపప్పు, నాని బియ్యం, అట్ల బతుకమ్మ, అలిగిన, వేపకాయల, వెన్నముద్దల, చివరిగా సద్దుల బతుకమ్మ లాంటి పేర్లతో తొమ్మిది రోజుల పాటు పూజలు చేస్తారు. అమ్మవారికి రోజుకో నైవేద్యం సమర్పిస్తారు. నువ్వులు, బియ్యం పిండి, నూకల పిండి కలిపిన ప్రసాదం, ముద్దపప్పు, పాలు, బెల్లం, అట్లు దోసెలు, బియ్యంపిండి లడ్డూలు తదితర నైవేద్యాలను అమ్మవారికి సమర్పిస్తారు.

ఆనవాయితీగా వస్తుంది..

తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను భక్తితో కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆర్థిక సమస్యలు, వ్యాపార, వ్యవసాయ సమస్యలు తీర్చాలని కోరుతూ అమ్మవారిని భక్తితో పూజించడం ఆనవాయితీగా వస్తుంది. ఇక ఆడపడుచుల విషయానికి వస్తే వివాహం జరగాలని, మంచి భర్త తమకు దొరకాలని కోరుకుంటూ ఈ బతుకమ్మను వేడుకుంటారు. వాడవాడలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి.

నమ్మకాలకు దర్పణం..



రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే పండుగ ఇది. మహిళల ఆశయాలు, ఆశలకు, నమ్మకాలకు దర్పణంగా నిలుస్తుంది. ఈ ఉత్సవాల్లో పాడే పాటలు జన జీవనం నుంచి ఉద్భవించాయి.

– జూపల్లి కౌసల్య, కౌన్సిలర్, షాద్‌నగర్

ప్రకృతిని ఆరాధించే పండుగ..



ప్రతీ ఏడాది వచ్చే అన్ని పండుగల కన్నా బతుకమ్మ ఎంతో ప్రత్యేకమైంది. ప్రకృతిని ఆరాధించే అరుదైన అద్భుతమైన పండుగ ఇది. బతుకమ్మలో పేర్చే రంగురంగుల పూలన్నీ ఔషధగుణాలు కలిగినవి.

– దేవకి, ఎస్‌ఐ, షాద్‌నగర్

పూలనే దేవతలుగా కొలవడం విశేషం



ప్రకృతిని పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ఏర్పడిన అన్ని పండుగల్లో కెల్లా బతుకమ్మ పండుగ ప్రత్యేకమైంది. మానవులు తమ ఉనికికి కారణమైన ప్రకృతిని గౌరవిస్తూ పూజిస్తూ వస్తున్నాడు. పూలతో దేవున్ని కొలుస్తారు. ఇక్కడ పూలనే దేవతగా పూజించడం విశేషం.

– బసిరెడ్డి పద్మ, సర్పంచ్, కంసాన్‌పల్లి, ఫరూఖ్‌నగర్

నిర్లక్ష్యం వహిస్తే సహించం

ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న కోట్ల ప్రశాంతిరెడ్డి

షాబాద్: అధికారులు విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించమని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు తమతమ శాఖకు సంబంధించి ఎజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ నిధులు అందక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధికారులను అడిగారు. విద్యుత్, తాగునీరు విషయాల్లో అధికారులు ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ జడలలక్ష్మి రాజేందర్‌గౌడ్, ఎంపీడీఓ అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంఈఓ శంకర్‌రాథోడ్, ఏఓ వెంకటేశం, ఏఈలు నరేందర్, శ్రీదివ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు విధి నిర్వహణే ముఖ్యం

రాజేంద్రగనర్ ట్రాఫిక్ ఏసీపీ మురళిక్రిష్ణ



చందర్‌నాయక్‌ను సన్మానించిన ఏసీపీ మురళిక్రిష్ణ, సీఐ సైదులు, సిబ్బంది

చేవెళ్ల: పోలీస్ ఉద్యోగులకు విధినిర్వహణే ముఖ్యమైనదని, ప్రతీ ఒక్కరు మంచి పేరుతెచ్చుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ మురళిక్రిష్ణ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ట్రాఫిక్ ఏఎస్ఐగా పనిచేస్తున్న చందర్‌నాయక్ బదిలీ సందర్భంగా ఆయనకు వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుల విధులు ఎప్పుడు, ఎక్కడ ఉంటాయో తెలియదని విధుల్లో చేరిన నాటి నుంచే అన్నింటికి ఉద్యోగులు సిద్ధపడాలన్నారు. ఎప్పుడు ఏ క్షణంలోనైనా పోలీసులకు బదిలీలు జరగొచ్చన్నారు. ఎక్కడ పనిచేసిన అక్కడ సక్రమంగా ప్రజా రక్షణకు పాటు పడాలన్నారు. ఏఎస్ఐ చందర్‌నాయక్ చేవెళ్లలో ట్రాఫిక్ ఏఎస్ఐగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని ఏసీపీ గుర్తు చేశారు. అనంతరం చందర్‌నాయక్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ఉన్నతాధికారులనుంచి కింది స్థాయి సిబ్బంది వరకు సహకారం అందించారని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు సైదులు, బోస్‌కిరణ్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వం

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కొందుర్గు: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. పదేళ్లలో చేయలేని అభివృద్ధి తొమ్మిది రోజుల్లో చేయనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు హడావిడి చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గురువారం కొందుర్గు మండలంలోని ముట్పూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను మరోసారి మోసం చేయాలని అభివృద్ధి పనులను ఎరవేస్తున్నారన్నారు. గత రెండు శాసన సభ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడంతో ప్రజలు విసుగుచెంది కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షుడు కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, ఆంజనేయులు, రవి, నర్సింలు, శ్రీనివాసు, ద్విజేందర్, శివ, రామ్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, నర్సింహారెడ్డి, అంజి రెడ్డి, పాల్గొన్నారు.

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో చేవెళ్లలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ



విగ్రహ ఆవిష్కరణ చేసిన జయశ్రీశ్యాంసుందర్ దంపతులు, విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకులు

చేవెళ్ల: తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్‌సార్ సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధన్‌మోహన్ చారి, జయశంకర్‌సార్ మేనకోడలు జయశ్రీశ్యాంసుందర్ దంపతులు అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించి తెలంగాణ రాష్ట్రం ఎందుకు కావాలో తెలంగాణ సమాజానికి అర్థమయ్యే విధంగా ఆధారాలను చూపించిన మహనీయుడని అన్నారు. ఆయన తన చివరి శ్వాస వరకు రాష్ట్ర సాధన కోసం కృషి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఆయనను ఎందుకు మరిచిపోయారోనని, ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కలేదన్నారు. చేవెళ్లలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసుకోవటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం. విజయలక్ష్మీ, సర్పంచ్ బి. శైలజ, కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు డి. సమత, ఎంపీటీసీలు వసంతం, రాములు, సత్యానారయణచారి, నరేందర్‌చారి, మార్కెట్‌కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, బీజేపీ మండలప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు కె. రామస్వామి, విశ్వకర్మ రాష్ట్రర గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాస్‌చారి, పి. బ్రహ్మచారి, లింగచారి, మాణిక్యం, డాక్టర్ రేణుకచారి, తదితరులు పాల్గొన్నారు.

సంఘం సభ్యులను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే...

ఈ విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానించిన ఎన్నికల కోడ్ కారణంగా హాజరు కాకుండా విశ్వకర్మ సంఘం సభ్యులను చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు కలిసి వెళ్లారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం
- పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన సదస్సులు
- సాక్షితో ఇంటర్వ్యూలో షాద్‌నగర్ ఆర్డీఓ వెంకట మాధవరావు



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటమాధవరావు

షాద్‌నగర్: రాబోవు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాం. మద్యం, డబ్బులు, నగలు సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు.

సాక్షి: నియోజకవర్గంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు

జవాబు: ఈ నెల 4న వెల్లడించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం షాద్‌నగర్‌లో మొత్తం 2,25,470మంది ఉన్నారు. అందులో పురుషులు 1,13,872 మంది, మహిళలు 1,11,583 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు. మొత్తం నియోజకవర్గంలో 252 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఓటు హక్కు నమోదుకు ఈ నెల 31 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

సాక్షి: డబ్బులు, నగదు, మద్యం సరఫరాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఉండేందుకు ఓటు విలువ తెలిసేలా ఓటర్లను చైతన్య పరుస్తున్నాం. నియోజకవర్గంలో మూడు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేశాం.

సాక్షి: ఈ సారి ఎన్నికల్లో ఏమైనా ప్రత్యేకత ఉండనుందా

జవాబు: దివ్యాంగులు, వయోవృద్ధులకు (80ఏళ్ల దాటిన వారు) ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించింది. వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఇచ్చారు.

సాక్షి: ఎన్నికల ఖర్చుల కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టారు

జవాబు: ఎన్నికల సమయంలో ఖర్చులను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అకౌంటింగ్ బృందాలు అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన వెంటనే బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రచారంతో పాటుగా ఇతరత్రా కార్యక్రమాలకు చేస్తున్న వ్యయాన్ని పరోక్షంగా బృందాలు పరిశీలిస్తాయి.

సాక్షి: ఎన్నికల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

జవాబు: ఎన్నికలు సజావుగా, సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించనున్నాం.

సాక్షి: పోలింగ్ శాతం పెంచేందుకు ఏవిధంగా చర్యలు చేపట్టారు

జవాబు: పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే పట్టణాలతో పాటు గ్రామాల్లో, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాం. పట్టణాల్లో 2కే రన్ నిర్వహించాం. కళాజాత బృందాలతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం.

సాక్షి: సమస్యాత్మకమైన గ్రామాలపై ఎలాంటి దృష్టి సారించారు

జవాబు: పోలీస్ అధికారుల సహకారంతో సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించాం. అలాంటి గ్రామాల్లో ఉండే పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు చర్యలు చేపడుతాం. ప్రతీ పోలింగ్ కేంద్రంలోనూ మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరుగుతుంది. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం.

16న చింత చెట్ల కౌలు వేలం

షాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన చింతచెట్ల ఫలసాయం కోసం ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 16వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు దేవాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా చెట్ల ఫలసాయం కాపును చూసుకోవాలన్నారు. దేవస్థానానికి రూ.500 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రతీ ఒక్కరు విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని కృష్ణవేణి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా అన్నారు. గురువారం పట్టణంలోని భాగ్య నగర్ కాలనీలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు విరాళాలను సేకరించి సచ్ ఆర్గనైజేషన్‌కు చెందిన అంధ విద్యార్థులకు రూ. 45వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ



చేవెళ్లలోని శ్రీసాయిచైతన్య హైస్కూల్‌లో



కొందుర్గు: బతుకమ్మ తయారు చేస్తున్న మహిళలు



హైతాబాద్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేవెళ్ల: చేవెళ్లలోని శ్రీసాయిచైతన్య హైస్కూల్‌లో కరస్పాండెంట్ నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.

షాబాద్‌లో..

షాబాద్: షాబాద్ మండలంలోని పలు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలు తయారు చేసి వేడుకలు నిర్వహించుకున్నారు. బతుకమ్మ పాటలను పాడి ఆడారు.

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని ముట్పూర్, ఇంద్రానగర్, పెద్దఎల్కిచర్ల, తుమ్మలపల్లి తదితర పాఠశాలల్లో విద్యార్థులు గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను అమర్చి ఉయ్యాల, ఉయ్యాల అంటూ ఆడి పాడారు.

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సక్కుబాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యాయులు గీతమ్మ, వందన, గీత, అరుణ, బుగ్గమ్మ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని కాకతీయ స్కూల్‌లో ప్రిన్సిపల్ స్వాతిరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.



ఎలికట్టలో ఉపాధ్యాయులు, విద్యార్థులు